
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY భద్రాద్రి కొత్తగూడెం BHADRADRI KOTHAGUDEM
సోమవారం 8 డిసెంబరు 2025
5



భద్రాద్రి రామయ్యకు
స్వర్ణ పుష్పార్చన, నిత్యకల్యాణం

భద్రాచలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్జిత సేవలో భాగంగా భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన, ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామివారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. బీజేపీ అధికార ప్రతినిధి కె.మాధవీలత భద్రాద్రి రామయ్యను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎన్నికల ప్రచారంలో
ఘర్షణ


- బీఆర్ఎస్ ప్రచార వాహన డ్రైవర్‌పై కాంగ్రెస్ కార్యకర్త దాడి
- నిరసనగా బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో



అంబేద్కర్ సెంటర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మణుగూరు మండలంలోని సమితి సింగారం పంచాయతీ టేకుచెట్ల బజార్ సమీపంలో ఆదివారం కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పంచాయతీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తున్న క్రమంలో.. మార్గమధ్యలో బీఆర్ఎస్ నాయకులు తారసపడ్డారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వాహన ప్రచార ఆటోలో డ్రైవర్ ఎక్కువగా సౌండ్ పెట్టడంతో.. కాంగ్రెస్ నాయకులు సౌండ్ తగ్గించాలని కోరారు. అయితే ఇదేమి పట్టించుకోకుండా.. డ్రైవర్ వాహనాన్ని నడిపాడు. దీంతో (మిగతా 8వ పేజీలో)

ఓట్ల కోసం..
కాసుల వేట!



- డబ్బు వెదుకులాటలో పంచాయతీ బరిలో ఉన్న అభ్యర్థులు
- ఓట్ల కొనుగోలు కోసం వార్డుల వారీగా లెక్కలు
- మేజర్ పంచాయతీల్లో రూ.కోటికి పైనే ఖర్చు
- ఉమ్మడి జిల్లాలో గరంగరంగా రాజకీయం

ఖమ్మం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఓట్ల కోసం కాసుల వేట మొదలైంది. మొదటి విడత ఎన్నికలకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుండడంతో.. ఉమ్మడి జిల్లాలో పంచాయతీ బరిలో ఉన్న అభ్యర్థులకు 'డబ్బు' టెన్షన్ మొదలైంది. ఇప్పటికే వార్డు సభ్యులు, సర్పంచ్ అభ్యర్థులు సొమ్ముల వేట మొదలెట్టారు. ఓటుకు కనీసం రూ. 500 నుంచి 1000తో పాటు పంచాయతీ పోరు ప్రతిష్టాత్మకంగా ఉన్న చోట మరింతగా కాసులు ఇచ్చుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రధానంగా సత్తుపల్లి నియోజకవర్గంలో పంచాయతీ పోరు రూ.కోట్లకు పడగలెత్తే పరిస్థితి ఉంది. దీంతో ప్రధాన పార్టీ అభ్యర్థులు ఎవరికి వారు పంచాయతీలోని వార్డుల వారీగా ఓట్ల లెక్కలు వేసుకుంటున్నారు. అదే సమయంలో కేటగిరీలుగా విభజించుకుంటున్నారు. డబ్బులు ఎవరికి ఇవ్వాలి!? గిఫ్టులు ఎవరికి పంచాలి!? ఓటర్ల వారీగా జాబితాలు సిద్ధం చేస్తున్నారు!? నేరుగా ఓటర్లకే డబ్బులు బహుమతులు అందేలా ఇప్పటి నుంచే ప్రధాన పార్టీల అభ్యర్థులు సిద్ధం చేసుకుంటున్నారు. మొదటి విడతలో 20 పంచాయతీలు, రెండో విడతలో 22పంచాయతీలు ఏకగ్రీవమైన విషయం తెలిసిందే.

మూడో విడత కూడా కొన్ని పంచాయతీలు ఏకగ్రీవం కానున్నాయి. ఏకగ్రీవ పంచాయతీల్లో అధికార కాంగ్రెస్ హవా కనిపిస్తోంది. పోటీ ఉన్న పంచాయతీల్లోనే డబ్బులు భారీగానే ఖర్చయ్యే పరిస్థితి నెలకొంది. రిజర్వ్ పంచాయతీల్లో రూ. 25 లక్షలు, బీసీ, జనరల్ చిన్న పంచాయతీల్లో రూ.50 లక్షలు, మేజర్ పంచాయతీల్లో కోటి రూపాయలకు పైగానే అభ్యర్థులు ఖర్చు చేసే పరిస్థితి ఉమ్మడి జిల్లాలో కనిపిస్తోంది. మొదట్లో సర్పంచ్ పదవికి ఇష్టపడే చాలామంది నామినేషన్లు వేశారు. కొందరు పార్టీ నుంచి సహాయం అడుగుతుండగా.. మరికొందరు వ్యక్తిగత ఖర్చుకు సైతం సై అంటున్నారు. బంధువులు, మిత్రుల వద్ద కొందరు, భూములు ఇతర ఆస్తులు పెట్టి కొందరు సొమ్ముల కోసం కుస్తీ పడుతున్నారు. మొదటి విడత 11వ తేదీన, రెండో విడత 14న మూడో విడత 17న మధ్యాహ్నం వరకు పోలింగ్.. ఆ తర్వాత సాయంత్రం అదే పంచాయతీలో కౌంటింగ్ నిర్వహిస్తారు. దీంతో పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్, బీజేపీ, వామపక్ష నేతలంతా ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల్లో బిజీ బిజీగా వ్యవహరిస్తున్నారు మున్సిపల్ పట్టణాలకు ఎన్నికలు లేకపోవడంతో.. పట్టణాల నేతలు పల్లె రాజకీయాల్లో తలమునకలయ్యారు. నియోజకవర్గ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మండల నాయకులు పంచాయతీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కుల సంఘాల నాయకులను, పరపతి పలుకుబడి ఉన్న నేతలను మచ్చిక చేసుకొని పంచాయతీ ఎన్నికల్లో ఓట్లు సాధించే పనుల్లో ఉన్నారు. ఓట్లు వస్తాయని అనుకున్న చోట గ్రామాభివృద్ధికి హామీలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల బిల్లులు మంజూరు చేయించడం.. చోటమోటా కాంట్రాక్టర్లతో పాటు గ్రామాల్లో గేమ్ చేంజర్ పెద్దలను కూడా తమ వైపునకు తిప్పుకునేందుకు వ్యవహారాలు నడిపిస్తున్నారు. విపక్ష పార్టీల నేతలు కూడా గత పరిచయాలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో సర్పంచ్, ఉపసర్పంచ్ పదవులు దక్కేలా ప్రయత్నాలు సాగిస్తున్నారు. మొత్తమ్మీద పంచాయతీ తొలి విడత ఎన్నికల ప్రచార ప్రక్రియ సాగుతుండగా.. రెండో విడత ఎన్నికల ప్రచార ఘట్టం మొదలైంది. మరోవైపు.. మూడో విడత బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాను సోమవారం ప్రకటించనున్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లకావత్ రూప్‌సింగ్

18నుంచి జిల్లాలో జాగృతి
జనం బాట

- కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లకావత్ రూప్‌సింగ్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 18, 19వ తేదీల్లో తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో జనం బాట కొనసాగనుందని జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లకావత్ రూప్‌సింగ్ తెలిపారు. ఆదివారం కొత్తగూడెం పట్టణంలో నిర్వహించిన జాగృతి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో రెండు రోజుల పాటు జరిగే జనం బాట కార్యక్రమంలో సబ్బండ వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు జాగృతి ఆధ్వర్యంలో జనం బాట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. రెండు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా కవిత పర్యటిస్తారని తెలిపారు. జనం బాట కార్యక్రమంలో ప్రజలు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జాగృతి జిల్లా అధ్యక్షుడు డి.వీరన్న, రాష్ట్ర కార్యదర్శి పవన్‌నాయక్, కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ జగదీష్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు లకావత్ సురేష్, ఆటో విభాగం జిల్లా అధ్యక్షుడు రాంబాబు ఆదినారాయణ, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు, కట్ట సాంబశివరావు, సభ్యులు లాలు ఖలీల్, భాగ్యలక్ష్మీ, విజయ, సుగుణ పాల్గొన్నారు.



పక్కా గృహాలు మంజూరైనప్పటికీ.. విద్యుత్ లైన్ల మూలంగా ప్రజలు గృహ నిర్మాణాల పనులకు అడ్డుగా ఉన్నాయని శ్లాబ్‌లు వేసేందుకు సుతారులు, కూలీలు విద్యుత్తుషాక్‌ల భయంతో వెనుకడుగు వేస్తున్నారని తెలిపారు. వర్షాకాలంలో విద్యుత్తు లైన్ల స్తంభాల మూలంగా పలువురు విద్యుదాఘాతానికి గురయ్యారని వాపోయారు. గతంలో విద్యుత్తు లైన్లు భవిష్యత్తు భవన నిర్మాణాలను శ్లాబ్‌ల పనులు గుర్తించకుండా డాబాలపైన నిలబడితే చేతికి తగిలే రీతిలో ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. అనేక పర్యాయాలు విద్యుత్ శాఖాధికారులకు తమ గోడు వివరించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని, ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు గృహాలపై ఉన్న విద్యుత్తు లైన్లు తొలగించాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు సుభాష్‌నగర్ ఏరియా ప్రజలు వినతి పత్రం సమర్పించారు.

నివాసాలపై విద్యుత్ లైన్లు

- ఇందిరమ్మ గృహాల నిర్మాణాలకు అడ్డు
- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు

ఇల్లెందు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో నివాస గృహాలు, ఇందిరమ్మ గృహాల నిర్మాణాలకు విద్యుత్తులైన్ల మూలంగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.. నివాస గృహాలపై 33/11 కేవీ విద్యుత్తు లైన్లు ఉండడం వల్ల భవనాలపై అదనపు గదులు, రెండో అంతస్తుల నిర్మాణాలకు అడ్డుగా విద్యుత్తు లైన్లు ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ఖాళీ స్థలాల్లో ఇందిరమ్మ

ఒకటికి.. రెంటికీ
కష్టమే!

- కార్పొరేషన్‌లో మరుగుదొడ్లు పనిచేయక ప్రజల ఇక్కట్లు
- రూ.లక్షలు వెచ్చించినా.. నెరవేరని ప్రభుత్వ లక్ష్యం
- సామాజిక బాధ్యతను విస్మరించిన సింగరేణి

కొత్తగూడెం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన కొత్తగూడెం కార్పొరేషన్‌లో ప్రజల అవసరాలను తీర్చడం కోసం లక్షల రూపాయలు వెచ్చించి మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. లక్షలు వెచ్చించినా.. లక్ష్యం నెరవేరక ప్రజలు పడుతున్న వెతలు వర్ణనాతీతం. ఒకటికి.. రెంటికీ.. కష్టంగా మారడంతో ప్రధానంగా మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి కొత్తగూడెం కార్పొరేషన్‌లో నెలకొంది. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణానికి వివిధ అవసరాల నిమిత్తం జిల్లా నలుమూలల నుంచి నిత్యం వేలాది మంది రాకపోకలు కొనసాగిస్తున్నారు. అత్యవసరమైన పరిస్థితులు ఎదురైతే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగూడెం పట్టణంలో ప్రజల అవసరాలను గుర్తించడంలో మునిసిపల్ పాలకవర్గాలు, అధికారులు విఫలమయ్యారు. బస్టాండ్ సమీపంలో నవభారత్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సామాజిక మరుగుదొడ్ల సముదాయాన్ని కొత్తగూడెం బస్టాండ్ సమీపంలో 2019లో ఏర్పాటు చేసింది. కొంతకాలంగా కార్యకలాపాలు సాగించినప్పటికీ.. గత రెండేళ్లుగా మూతపడి ప్రజల ఇబ్బందులు పడుతున్నారు. స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛ కొత్తగూడెం పేరుతో ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సమీపంలో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్ల తలుపు తీసిన నాథుడే కరువయ్యాడు. స్వచ్ఛభారత్ ఆధ్వర్యంలో పోస్టాఫీస్ సెంటర్‌లో నిర్మించిన మరుగుదొడ్ల నిర్వహణ నిలిచిపోయింది. దీంతో కొత్తగూడెం పట్టణానికి వివిధ అవసరాల నిమిత్తం దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు సరైన సౌకర్యాలు కల్పించడంలో కొత్తగూడెం మునిసిపల్ అధికారులు విఫలం చెందారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. లక్షల రూపాయల



మూతబడ్డ సామూహిక మరుగుదొడ్ల కాంప్లెక్స్

వ్యయంతో నిర్మించిన మరుగుదొడ్ల లక్ష్యం నెరవేరని పరిస్థితి ఎదురవుతోంది. కార్పొరేషన్ పరిధిలోని పాత బస్ డిపో నుంచి రామవరం ప్రధాన రహదారిపై పలుచోట్ల సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని ప్రతిపాదనలు రూపొందించినప్పటికీ.. ఆచరణలో అమలు కాని పరిస్థితులు ఉన్నాయి. కొత్తగూడెం పట్టణ ప్రజలతో పాటు జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుంచి వేలాది మంది ప్రజలు వైద్య సేవల నిమిత్తం, వివాహాది శుభకార్యాలు, ఇతర అవసరాల నిమిత్తం కొత్తగూడెం వస్తూ (మిగతా 6వ పేజీలో)

ప్రభుత్వ పాఠశాలలను
రక్షించుకోవాలి

- పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి
- టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలి
- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి
- పేటలో అట్టహాసంగా జిల్లాస్థాయి కమిటీ విస్తృత సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి

అశ్వారావుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయని, సమస్యలను పరిష్కరించకుండా కొత్త పాఠశాలలను ఏర్పాటు చేయటం తగదని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడుచావా రవి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకునేందుకు ప్రభుత్వం వెంటనే కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లాలోని అశ్వారావుపేటలో గల సాయిరంగా ఫంక్షన్‌హాల్‌లో జిల్లాస్థాయి కమిటీ విస్తృత సమావేశం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు మురళీమోహన్ అధ్యక్షతన జరిగిన మహాసభలో రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి మాట్లాడుతూ.. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో విద్యారంగం కుంటుపడిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడు, బోధనేతర సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. 2010 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. 2010 కంటే ముందు ఉపాధ్యాయులకు టెట్ అవసరం లేదని చెప్పిన ప్రభుత్వం.. ఇప్పుడు తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలని చెప్పడం సరైంది కాదన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. 2023 నుంచి రావాల్సిన పీఆర్‌సీని మంచి ఫిట్‌మెంట్‌లో ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపితే ఉద్యమాలు చేపడతామన్నారు. అనంతరం ప్రతినిధుల సభను నిర్వహించి పలు తీర్మానాలు ఆమోదించారు. అంతకుముందు జిల్లాలోని నలుమూలల నుంచి తరలివచ్చిన ఉపాధ్యాయులతో పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. కోలాట ప్రదర్శనలు, గిరిజన సాంప్రదాయ నృత్యాలతో ప్రదర్శనలు నిర్వహించారు. సమావేశ ప్రాంగణం వద్ద సంఘం జెండాను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జీ కార్యదర్శి రాజు, జిల్లా ఉపాధ్యక్షులు వరలక్ష్మీ, రాజయ్య, జిల్లా కోశాధికారి వెంకేశ్వర్లు, జిల్లా కార్యదర్శి కృష్ణారావు, హతిరాం, రమేశ్‌కుమార్, తావురియా, మండల బాధ్యులు హరినాథ్, వెంకటేశ్వర్లు, దమ్మపేట బాధ్యులు రమేశ్, మల్లేశ్వరావుతో పాటు రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



లక్ష్మీదేవిపల్లి మండలంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్షంలో సీపీఐలో చేరిన నాయకులు

జోరుగా పల్లె పోరు

- జిల్లాలో హాట్‌హాట్‌గా రెండో విడత 'పంచాయతీ'
- 155 పంచాయతీలకు సర్పంచ్, 277వార్డులకు 534 మంది నామినేషన్ల ఉప సంహరణ
- ఏకగ్రీవమైన సర్పంచ్‌లు 16, వార్డు సభ్యులు 386
- పోరుకు సిద్ధమై.. బరిలో నిలిచిన సర్పంచ్‌లు 138, వార్డు సభ్యులు 1123 మంది
- పార్టీలు మారుతున్న నాయకులు
- 14న పోలింగ్, అదే రోజు ఫలితాలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పంచాయతీ పోరు హాట్‌హాట్‌గా కొనసాగుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయం జోరుగా.. రసవత్తరంగా కొనసాగుతోంది. రెండవ విడత నామినేషన్ల ప్రక్రియ ముగిసి, పరిశీలన, ఉపసంహరణ ఆదివారం తెల్లవారుజాముతో ముగిశాయి. దీంతో రెండవ విడతలో జిల్లాలోని 7 మండలాలు పల్లె పోరుకు నాయకులు సిద్ధమయ్యారు. ఉపసంహరణ గడువు ముగియడంతో జిల్లా పంచాయతీ అధికారులు అధికారికంగా ఏకగ్రీవమైన పంచాయతీలు, నామినేషన్లు ఉపసంహరణ వివరాలు, ఎన్నికల బరిలో తుదిపోరులో పోటీపడే సర్పంచ్, వార్డు సభ్యుల వివరాలను ఆదివారం ప్రకటించారు. వీటిలో అన్నపురెడ్డిపల్లి - 10 పంచాయతీలకు గాను 15 సర్పంచ్ అభ్యర్థులు, 68 వార్డు సభ్యులు నామినేషన్ ఉపసంహరణ చేసుకోగా 8 మంది సర్పంచ్, 79 వార్డు సభ్యులు బరిలో నిలిచారు. అశ్వారావుపేట -27 పంచాయతీలకు 66 సర్పంచ్ అభ్యర్థులు, 63 వార్డు సభ్యులు నామినేషన్ ఉపసంహరణ చేసుకోగా 25 మంది సర్పంచ్, 191 వార్డు సభ్యులు బరిలో నిలిచారు చంద్రుగొండ - 14 పంచాయతీలకు 39సర్పంచ్ అభ్యర్థులు, 125 వార్డు సభ్యులు నామినేషన్ ఉపసంహరణ చేసుకోగా 12 మంది సర్పంచ్, 108 వార్డు సభ్యులు బరిలో నిలిచారు. చుంచుపల్లి -18 పంచాయతీలకు 28 సర్పంచ్ అభ్యర్థులు, 62 వార్డు సభ్యులు నామినేషన్ ఉపసంహరణ చేసుకోగా 17 మంది సర్పంచ్, 159 వార్డు సభ్యులు బరిలో నిలిచారు. దమ్మపేటలో 31 పంచాయతీలకు గాను 42 సర్పంచ్ అభ్యర్థులు, 78 వార్డు సభ్యులు నామినేషన్ ఉపసంహరణ చేసుకోగా.. 27 మంది సర్పంచ్, 234 వార్డు సభ్యులు బరిలో నిలిచారు. ములకలపల్లిలో 20పంచాయతీలకు గాను 46 సర్పంచ్ అభ్యర్థులు, 65వార్డు సభ్యులు నామినేషన్ ఉపసంహరణ చేసుకోగా.. 18 మంది సర్పంచ్, 144 వార్డు సభ్యులు బరిలో నిలిచారు. పాల్వంచలో 36పంచాయతీలకు గాను 66 సర్పంచ్ అభ్యర్థులు, 73వార్డు సభ్యులు నామినేషన్ ఉపసంహరణ చేసుకోగా.. 31మంది సర్పంచ్, 208 వార్డు సభ్యులు (మిగతా 8వ పేజీలో)

మోసం చేసి పార్టీలు మార్చింది మీరే..

- తండ్రీ కొడుకు చెరో పార్టీలో ఉన్న చరిత్ర మీదే
- మంత్రి తుమ్మల అడుగు జాడల్లో యుగంధర్
- గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలవలేకే వ్యక్తిగత దూషణలు
- డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం కార్పొరేషన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగురాష్ట్రంలో ఎందరో ఆదర్శవంతమైన జాతీయ, రాష్ట్రీయ రాజకీయ నాయకులు జన్మనిచ్చిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మోసం చేసి పార్టీలు మార్చింది మీరేనని, ఒక పార్టీలో గెలిచి అధికారం కోసం మరో పార్టీలో చేరి గెలిపించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లపై రౌడీషీట్లు కేసులు పెట్టించింది మీరే అంటూ జిల్లా నగర కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, నాగండ్ల దీపక్‌చౌదరి ఆరోపించారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్‌పై చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టారు. అభివృద్ధి గురించి మాట్లాడే కనీస అర్హత పువ్వాడ అజయ్‌కు లేదన్నారు. ఖమ్మం ఎమ్మెల్యేగా ప్రస్తుత రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పనిచేసిన కాలంలో ఖమ్మం నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కోట్లాది నిధులు మంజూరు చేయించి శంకుస్థాపనలు చేయిస్తూ తర్వాత మంత్రిగా పనిచేసిన పువ్వాడ రిబ్బన్లు కట్ చేయించుకుంటూ వెళ్లారని కొత్తగా శంకుస్థాపనలు చేయలేదన్నారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 40ఏళ్ల రాజకీయాల్లో ఉమ్మడి తెలుగురాష్ట్రంలో ఏ జిల్లాకు వెళ్లినా కనిపిస్తుందన్నారు. రఘునాథపాలెం మండలంలో ప్రభుత్వ వైద్యశాల, స్వామినారాయణ విద్యాసంస్థలు, టీటీడీ దేవాలయం, ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఎవ్వరు తీసుకొచ్చారని ప్రశ్నించారు.

వర్షాధారంపై ఆధారపడిన మండలంలో మంచుకొండ ఎత్తిపోతల పథకం కేవలం ఏడాదిలోపే శంకుస్థాపన చేసి న 36చెర్వులకు మండుటెండల్లో సాగునీరు తాగు నీరు అందించిన ఘనకీర్తి మంత్రి తుమ్మలకే దక్కిందన్నారు. మంత్రి తుమ్మల మీకు లాగా గల్లి నాయకులు కాదని జాతీయ, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నాయకులుగా గుర్తింపు ఉందన్నారు. విలీన ప్రాంతాల అభివృద్ధి ఇప్పుడు అభివృద్ధి జరిగిందన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ కొడుకు పేరుతో కాంట్రాక్టు సంస్థను నిర్మాణం చేసి ప్రభుత్వ సోమ్ములు దొచుకున్న చరిత్ర పువ్వాడకే దక్కిందన్నారు. డీసీసీ మాజీ అధ్యక్షులు పువ్వాడ దుర్గాప్రసాద్, కార్పొరేటర్లు కమర్తపు మురళీ, నిర్మల, కాంగ్రెస్ నాయకులు గజ్జల వెంకన్న, మందడపు మనోహార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెల్వలేక ఇటువంటి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపును ఓర్వలేక ఇటువంటి వ్యాఖ్యలు తుమ్మల యుగంధర్‌పై చేశారని ఆరోపించారు.

రామదాసు నవరత్న కీర్తనలతో..

రామయ్యకు నీరాజనం

- నేడు సంగీత కళానిధి నేదునూరి 11వ వర్ధంతి
- భద్రాద్రితో ఆయన అనుబంధం విడదీయరానిది

భద్రాచలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రామునిపై.. రామదాసుపై తనకున్న మక్కువను చాటుకునేందుకు రామదాసు నవరత్న కీర్తనలతో రామయ్యకు నీరాజనంను ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు నేదునూరి కృష్ణమూర్తి సమర్పించారు. పలుమార్లు ప్రసిద్ధరామక్షేత్రంగా బాసిల్లుతున్న భద్రాచలంలో తన మృదుమాధుర గానంతో సంగీతాభిమానులను భక్తి సాగరంలో ఓలలాడించిన సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి 11వ వర్ధంతి నేడు. భద్రాద్రితో నేదునూరి అనుబంధం విడదీయరానిది. రాముడు రామదాసు కీర్తనలపై తనకున్న మక్కువను చాటుతూ భక్తరామదాసు నవరత్న కీర్తనలను తన శిష్యులతో కలిసి రూపొందించి తన ఆరాధ్యదైవమైన రామయ్య సన్నిధిలోనే ఆవిష్కరించారు. అంతేకాదు భక్తరామదాసు వాగ్గేయకారోత్సవాల్లో పాల్గొని స్వయంగా తన శిష్య బృందంతో గానం చేసి తన భక్తిని చాటుకున్నారు. ఏడేళ్లపాటు ఆయన భద్రాద్రి దేవస్థానం, శ్రీ చక్రా సిమెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తరామదాసు జయంతోత్సవాల్లో పాల్గొన్నారు. అంతేకారు గత ఐదు దశాబ్దాలుగా తన వద్ద శిష్యరికం చేసిన వారిని వాగ్గేయకారోత్సవాలకు రప్పించి వారితో తాను సైతం కలిసి అజరామరమైన కీర్తనలను ఆలపించారు.

ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకరమైన మద్రాస్ మ్యూజిక్ అకాడమీచే సంగీత కళానిధి అవార్డును నేదునూరి కృష్ణమూర్తి అందుకున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ అవార్డు సైతం ఆయనకు ప్రభుత్వం అందజేసింది. తన గురువైన శ్రీపాద పినాకపాణిని ఎప్పుడు స్మరించుకునే నేదునూరి తన శిష్యులు సైతం ఉన్నత శిఖరాలకు చేరడంతో ఎంతో ఆనందభరితులు అవుతుంటారు. సంగీతంలో వేలాది ప్రదర్శనలు ఇచ్చిన ఆయనకు ప్రభుత్వం నుంచి పద్మ అవార్డులు రాకపోయినా ఎటువంటి నిస్పృహ చెందకుండా నాదోపాసనే పురస్కారంగా భావించడం ఆయన సంగీత వ్యక్తిత్వానికి నిదర్శనం.

సంగీత గానంతో అలరించిన నేదునూరి

సంగీతమే ఆయన సరస్వం.... ఆరు దశాబ్దాలకు పైగా సంగీతంలో ఆయన ఎన్నో అమూల్యమైన కీర్తనలను ఆలపించారు. త్యాగరాజు, అన్నమయ్య, భక్తరామదాసు ఇలా ఎందరో అపర భక్తాగ్రేసరుల కీర్తనలను అలవోకగా పాడుతూ సంగీత ప్రియులనే కాక పండిత పామరులను సైతం భక్తిసాగరంలో ముంచారు. అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెనడ, సింగపూర్ తదితర దేశాల్లో ఆయన 40 వేలకు పైగా కచేరీలు నిర్వహించారు.



నవరత్న కీర్తనలను ఆలపిస్తున్న సంగీత కళాకారులు(ఫైల్)



కీర్తనలను ఆలపిస్తున్న నేదునూరి(ఫైల్)

జగత్ ప్రసిద్ధి పొందిన త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో పంచరత్న సేవగా..... అన్నమయ్యకు సప్తగిరి కీర్తనలతో ఏ విధంగా కీర్తనార్చనలు సంగీత విద్వాంసులు నిర్వహిస్తారో అదే రీతిలో భద్రాద్రి రామయ్యకు నవరత్న కీర్తనలతో నీరాజనంను అందించే ప్రక్రియకు నాంది పలికిన నాదయోగి నేదునూరి. ప్రతి ఏటా భక్తరామదాసు జయంతి ప్రయుక్త వాగ్గేయకారోత్సవాల ప్రారంభ సభలో రామదాసు నవరత్న కీర్తనలతో రామయ్యకు నీరాజనం పలకడం ఒక సంప్రదాయ సేవగా ఆయన రూపొందించారు. నేదునూరి దివికేగిన ఆయన శ్రీకారం చుట్టిన సంప్రదాయాన్ని నేటికీ ఆయన శిష్య బృందమైన మల్లాది సోదరులు కొనసాగిస్తుండటం విశేషం.

పామాయిల్ మొక్కల తొలగింపు

అశ్వారావుపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వినాయకపురం పరిసరాలలో నాసిరకం మొక్కలను సరఫరా చేయడంతో పలువురి తోటల్లో పామాయిల్ మొక్కలు పూత కాత రాకుండా పోయాయని ఆయిల్‌పామ్ గ్రోవర్స్ అసోసియేషన్ బాధ్యులు తుంబూరు మహేశ్వరరెడ్డి, కె పుల్లయ్యలు వెల్లడించారు. ఆదివారం మండలంలోని వినాయకపురంలో 5.5 ఎకరాల్లో పామాయిల్ వేసిన తోటల్లో ఆరు సంవత్సరాలు గడిచిన పూత కాపు రాకపోవడంతో రైతు రామదేను దుర్గా ప్రసాదు తోటను పూర్తిగా తొలగించివేశారు. ఈ తోటను పరిశీలించిన రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ ఆరేళ్లు దాటినా పూత కాపు రాకపోవడం వల్ల రైతులు రూ.లక్షల్లో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆయిల్‌ఫెడ్ ఎండీ, జీఎం, ఉద్యాన, వ్యవసాయ శాఖ ఉన్నతాదికారులకు ఈ విషయంపై ఫిర్యాదు చేస్తామని వారు వెల్లడించారు. ఇలాంటి తోటలు వినాయకపురం పరిసరాలలో చాలా ఉన్నాయని, తమ తోటలను చూడాలని రైతులు కోరుతున్నందున స్థానిక ఎన్నికల అనంతరం తోటలను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని వారు వెల్లడించారు. కష్టపడి పెంచిన పామాయిల్ మొక్కలు కాపు లేకపోవడంతో శ్రమతో పాటు లక్షలాది రూపాయలు పెట్టుబడి, దిగుబడులు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రాసింగ్ జరిగిన మొక్కలు కాకుండా బైట దొరికిన నాసిరకం విత్తనాలు వినియోగం వల్ల ఈ నష్టం జరిగిందని ఆరోపించారు. ఆయిల్‌ఫెడ్ నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో చక్రధరరెడ్డి, చెలికాని వెంకట్ తదితరులు ఉన్నారు.



పామాయిల్ మొక్కలు తొలగించిన క్షేత్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కిషన్‌రెడ్డికి వినతి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేసిన ఎల్‌హెచ్‌పీఎస్ ప్రతినిధి బృందం

కొత్తగూడెం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కొత్తగూ డెం ఏరియా వెంకటేష్‌ఖని ఓపెన్ కాస్ట్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను స్థానికులతోనే భర్తీ చేయాలని కోరుతూ లంబాడీ హక్కుల పోరాట సమి తి ప్రతినిధి బృందం ఆదివారం హైదరాబాద్‌లోని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నా యక్ మాట్లాడుతూ ఏజెన్సీ హక్కుల చట్టం ప్రకారం ఓపెన్‌కాస్ట్‌లో స్థానిక గిరిజనులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరుణ్, కళ్యాణ్, పాండు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు ఇంకా వనవాసం తప్పట్లేదు

- కేంద్రం నిధులు పల్లెలకు చేరడం లేదు
- కూటమితోనే అభివృద్ధి సాధ్యం
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాధవీలత

భద్రాచలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రామయ్యకు ఇంకా వనవాసం తప్పట్లేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.మాధవీలత అన్నారు. గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు భద్రాద్రి ఆలయాభివృద్ధిని గాలికి వదిలేసాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాచలంలో బీజేపీ కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆదివారం ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ కేసీఆర్ దశాబ్దకాలంలో రామాలయ అభివృద్ధికి ప్రకటించిన రూ.100 కోట్ల నిధుల్లో పైసా కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019-20లో గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం రూ.1,020 కోట్లు మంజూరు చేస్తే కేసీఆర్ ప్రభుత్వం కేవలం రూ.600 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని దుయ్యబట్టారు. భద్రాద్రి ఏజెన్సీ అభివృద్ధి చెందాలనే సంకల్పంతో కేంద్రం ఎయిర్‌పోర్టు మంజూరు చేస్తే పదేళ్లుగా కనీసం బీఆర్ఎస్ ప్రభుత్వం స్థలం చూపలేకపోయిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పాండురంగాపురం మల్కనగిరికి వయా భద్రాచలం మీదుగా 173 కి.మీ. రైలు మార్గంను మంజూరు చేసి నిర్మాణం దిశగా పనులు సాగుతున్నాయన్నారు. బీజేపీ ప్రభుత్వం భద్రాద్రి అభివృద్ధికి ప్రసాద్ పథకం కింద రూ.93 కోట్లు కేటాయించిందన్నారు. భద్రాద్రికి వరదల నుంచి రక్షణ కలిగిందంటే అది గతంలో తమ మిత్ర పక్షమైన తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చంద్రబాబు చేసిన కరకట్ట నిర్మాణంతోనేనని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ అభ్యర్థి హరిశ్చంద్రనాయక్, కూటమి నాయకులు కొడాలి శ్రీనివాసన్, కుంచాల రాజారాం, కురిచేటి రామచంద్రమూర్తి, కుంజా ధర్మా, బండి రాంప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో పలు వీధుల్లో కూటమి బలపరిచిన అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహించారు.

ఒకటికి.. రెంటికీ కష్టమే!

(5వ పేజీ తరువాయి)

ఉంటారు. వీరికి కనీస సదుపాయాలు కల్పించడంలో.. అధికారులు విఫలమయ్యారు. ఓ ప్రైవేట్ సంస్థ సామాజిక బాధ్యతతో కొత్తగూడెంలో సామూహిక మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ.. తెలంగాణ రాష్ట్రంలోనే అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి ప్రధాన కార్యాలయంతో పాటు మైన్స్, డిపార్ట్‌మెంట్స్ ఉన్న సింగరేణి యాజమాన్యం సామాజిక బాధ్యతతో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకపోవడం వల్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడాది కావస్తున్నా.. అభివృద్ధి పనులు మాత్రం ముందుకు సాగడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. స్వచ్ఛ భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మరుగుదొడ్ల నిర్వహణపై కార్పొరేషన్ అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ప్రజల అవసరాల నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సమీపంలోనే మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ వాటి నిర్వహణపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగులు, వారి సమీప బంధువులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కనీసం ఇకనైనా కార్పొరేషన్ అధికారులు స్వచ్ఛ భారత్ మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా జరిగే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సమీపంలో నిర్మించిన స్వచ్ఛ భారత్ మరుగుదొడ్లు

జాతీయ స్థాయిలో ఏకలవ్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థుల్ని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

దుమ్ముగూడెం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీతారాంపురం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చారు. ఈనెల 3 నుంచి 5 వరకు ఏపీ రాష్ట్రం విజయవాడలో జరిగిన 6వ ఈఎంఆర్ఎస్ జాతీయ స్థాయి కల్చరల్ ఫెస్ట్‌లో పాఠశాల ఇంటర్ విద్యార్థులు పాల్గొని బహుమతులు సాధించారు. పన్నెండో తరగతి విద్యార్థిని పి.పరిమళ డివిషనల్ సాంగ్స్ విభాగంలో మొదటి బహుమతి, ఫోక్ ఇన్‌స్ట్రుమెంటల్ విభాగంలో 11వ తరగతి విద్యార్థి ఎస్.సిద్ధార్థ్ రెండవ బహుమతి సాధించాడు. వీరికి మంత్రులు కందుల దుర్గేష్, గుమ్మడి సంధ్యారాణిలు విజేతలకు అవార్డులనందించారు. ప్రిన్సిపల్ విజేందర్‌సింగ్, మ్యూజిక్ టీచర్ సూరేపల్లి నాగశ్రీలు, ఉపాధ్యాయులు ఆదివారం విద్యార్థుల్ని అభినందించారు.

భద్రాద్రి జిల్లా నిరుద్యోగులకు ఈఎంఆర్ఐలో ఉద్యోగ అవకాశాలు

చుంచుపల్లి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా నిరుద్యోగులకు ఈఎంఆర్ఐలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఉమ్మడి జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 108, 102 సంస్థల నందు ఉద్యోగ నియామకాల కోసం ఆసక్తి కల నిరుద్యోగులు మంగళవారం రామవవరం మాత శిశు ఉపకేంద్రంలో ఉద యం పది గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూకు సకాలంలో హాజరు కావాలని కోరారు. అభ్యర్థులు వారి వెంట తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లను, ఒక జిరాక్స్ సెట్‌ను తీసుకొని హాజరు కావాలన్నారు. మరిన్ని సమాచారం కొరకు 9704738677 ఈ ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



అజయ్ (ఫైల్)

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 3వ తేదీన సత్తుపల్లి మండలం కిష్టారంలోని అంబేద్కర్‌నగర్ వద్ద డివైడర్‌ను కార్ ఢీకొన్న ప్రమాదంలో మరో యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం ఖమ్మంలో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రానికి చెందిన తలారి జయరాజు, శ్రావణి దంపతుల కుమారుడు అజయ్ ఈ నెల 3న జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఐదు రోజుల పాటు మృత్యువుతో పోరాడుతూ ఆదివారం మృతిచెందాడు. కాగా డిగ్రీ పూర్తిచేసిన అజయ్ తండ్రి జయరాజు నాలుగేళ్ల క్రితం అనారోగ్య సమస్యతో మృతిచెందగా సోదరి దివ్యాంగురాలు కాగా తల్లి శ్రావణి సత్తుపల్లిలో ఓ హోటల్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే భర్తను కోల్పోయిన శ్రావణి కుమారుడిని కోల్పోయి దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

తల్లాడ, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలోని మిట్టపల్లి గ్రామంలో ఆదివారం టాస్క్‌ఫోర్సు అధికారులు దాడిచేసి అక్రమంగా నిల్వ చేసిన 40క్వింటాళ్ల రేషన్ బియ్యంను పట్టుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు మిట్టపల్లి గ్రామంలో ఓ ఇంట్లో నిల్వచేసిన అక్రమ రేషన్ బియ్యంను దాడిచేసి టాస్క్‌ఫోర్సు అధికారులు స్వాధీన పరుచుకున్నారు. అక్రమ రేషన్ బియ్యాన్ని నిల్వ చేసిన మిర్జా జిలానిబేగ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్సు ఏసీపీ సత్యనారాయణ తెలిపారు. కేసులో మరో నిందితుడు పరారీలో ఉన్నట్లుచెప్పారు. పట్టుకున్న బియ్యం విలువ సుమారు రూ.1.36 లక్షలు ఉంటుందన్నారు.

ఘనంగా పాలేరు నవోదయ అలుమ్ని మీట్

కూసుమంచి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాలేరు నవోదయలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ అలుమ్నికి నవోదయ విద్యాలయం ప్రారంభమైన 1986 నుంచి ఇప్పటి వరకు చదువుకున్న విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని 14వ బ్యాచ్ విద్యార్థులు (2000-07) నిర్వహించారు. ఈ మీట్‌కు ప్రతీ బ్యాచ్ నుంచి విద్యార్థులు రాగా... సుమారు 250 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల కేరింతలతో నవోదయ ప్రాంగణం సందడిగా మారింది. ప్రస్తుతం నవోదయలో చదువుతున్న విద్యార్థులు నృత్యాలతో అలరించారు.



అలుమ్నికి హాజరైన 1996-2001 బ్యాచ్ విద్యార్థులు

ద్విచక్ర వాహనంపై సామాన్యుడిలా..

భద్రాద్రి వైద్యశాలను రాత్రి సమయంలో ఆకస్మిక తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

భద్రాచలం డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆయన భద్రాచలం సబ్ కలెక్టర్.. ఒక సామాన్యుడిలా ఆదివారం రాత్రి భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు ద్విచక్ర వాహనంతో వెళ్లి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సమయంలో డ్యూటీ డాక్టర్ ప్రశాంత్, గైనకాలజిస్ట్ శంషాద్, వైద్య సిబ్బందితో సామాన్యుడి గానే వ్యవహరించి సబ్ కలెక్టర్ మృణాళ్ శ్రేష్ఠ వైద్యం గురించి అడుగుతూ కొంచెం విసిగించేలా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో వారి నుంచి సానుకూల స్పందన రావడంతో ఆయన వైద్యులు సిబ్బందిని అభినందించారు. వైద్యశాలలో రాత్రి 9:30 నుంచి 9:45 వరకు ఉన్న ఆయన తాను భద్రాచలం సబ్ కలెక్టర్‌నని వారికి తెలిపి రోగులకు అందుతున్న సేవలు ఇతరత్రా వివరాలను సైతం తెలుసుకున్నారు. వైద్యశాలకు చికిత్స కోసం వచ్చే నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందిని కోరారు.



వైద్యులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మృణాళ్ శ్రేష్ఠ

ఆకట్టుకున్న ఘంటసాల సంగీత విభావరి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సుధాస్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన భలే మంచి రోజు ఘంటసాల సంగీత విభావరి పాటకు పట్టాభిషేకం చేసింది. ఆదివారం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన భలే మంచి రోజు నిర్వాహకులు డాక్టర్ వాసుదేవ్, శఠగోపం సుదర్శన్, వినీలా సుదర్శన్ పర్యవేక్షణ లో నిర్వహించిన ఘంటసాల సంగీత విభావరి ప్రేక్షకులను వీణులవిం దు చేసింది. తొలుత ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి హెచ్ అరుణ్ కుమార్ హాజరై మాట్లాడారు. ఖమ్మంలో 29 ఏళ్లుగా భలే మంచి రోజు కార్యక్రమాన్ని ఖమ్మంలో వీనులవిందుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. డాక్టర్ వాసుదేవ్, శఠగోపం సుదర్శన్‌లు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో 29వసారి ఘంటసాల స్మారకార్థం సంగీత విభావరిని నిర్వహించే అవకాశం దక్కిందన్నారు. అతిథులుగా ఎస్పీ బాలసుబ్రమణ్య బాల్యమిత్రులు చెన్నైకి చెందిన జీవీ.మురళి, తెలుగు, హిందీ, కన్నడ సినీ గీత సాహిత్య విశ్లేషకులు జివి శేషుబాబు, ఆత్మీయ అతిథులుగా మహ్మద్ అజీజ్, మహ్మద్ జాన్ సాహెబ్, కాళ్ళ పాపారావు, కాటమనేని రమేష్, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షులు డాక్టర్ నాగబత్తిని రవి తదితరులు హాజరై మాట్లాడారు. అనంతరం గాయకులు టీపీ నారాయణ, ప్రవీణ్ కుమార్, వినోద్ బాబు, ఎస్వీ రమణ, సురేఖా మూర్తి, గాయత్రీనారాయణన్ సురభి శ్రావణి తదితరులు ఘంటసాల పాటలను ఆలపించారు. వినోద్ బాబు బృందం వాయిద్య సహకారం అందించగా, ఈ కార్యక్రమానికి పాడుతా తీయగా ఫెమ్ రాం ప్రసాద్ పర్యవేక్షణ చేశారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీమణి వ్యాఖ్యతగా వ్యవహరించారు.

ఏపీ ఎంపీ సీఎం రమేష్‌ను పరామర్శించిన మంత్రి తుమ్మల



నివాళులు అర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం కార్పొరేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడు సీఎం రమేష్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. ఎంపీ రమేష్ మాతృమూర్తి చింతకుంట రత్నమ్మ గత నెల 26న కన్నుమూశారు. సీఎం రమేష్ స్వగ్రామం ఏపీలోని కడప జిల్లా ఎర్రగుంట మండలం పొట్లదుర్తిలో ఎంపీ రమేష్ నివాసంలో చింతకుంట రత్నమ్మ 13వ రోజు వర్ధంది కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమానికి హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎంపీ రమేష్‌ను కుటుంబ సభ్యులను పరామర్శించారు. రత్నమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

అనంతారంలో అన్నదమ్ముల మధ్య రసవత్తర పోటీ



కుంజా రవి



కుంజా సతీష్

జూలూరుపాడు, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతారం పంచాయతీలో అన్నదమ్ముల మధ్య రసవత్తర పోటీ నెలకొంది. సొంత సోదరులు ఇద్దరూ వేరువేరు పార్టీల తరుపున వార్డుసభ్యులుగా పోటీ చేస్తుండటం ఆసక్తిని రేపుతుంది. ఇప్పటికే వారిద్దరు వేరువేరు పార్టీల తరుపున నామినేషన్లు వేసి ప్రచారాన్ని సాగిస్తున్నారు. వివరాల్లోకెళితే మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన అన్నదమ్ములు కుంజా రవి, కుంజా సతీష్‌లు ప్రస్తుతం జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో 5వ వార్డు నుంచి ఇద్దరు పోటీ చేస్తున్నారు. అన్న రవి బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తుండగా తమ్ముడు సతీష్ కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్నాడు. ఇప్పటికే అన్నదమ్ములు ఇద్దరు ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ వార్డులో 70 ఓట్లు ఉన్నాయి.

వార్డు బరిలో అత్తాకోడలు..

అనంతారం పంచాయతీలో వార్డు బరిలో అత్తాకోడళ్లు పోటీలో తలపడుతున్నారు. గ్రామానికి చెందిన ఇర్పా శ్రీలత, ఇర్పా సునీతలు వరుసకు అత్తాకోడళ్లు. కాగా 3వ వార్డు నుంచి ఇద్దరు వేరువేరు పార్టీల తరుపున వార్డు సభ్యులుగా పోటీచేస్తున్నారు. అత్త శ్రీలత బీఆర్ఎస్ తరపున, సునీత కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో నిలిచారు. ఈ వార్డులో 72 ఓట్లు ఉన్నాయి. కాగా ఇద్దరు ఓటర్లను తమ వైపుకు ఆకట్టుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

... బరిలో ఒకే కుటుంబంలో పిన్ని, కూతురు

కామేపల్లి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ఒకే కుటుంబంలో పిన్ని, కూతురు పోటీకి దిగిన సంఘటన కామేపల్లి మండలం జాస్తిపల్లి గ్రామంలో చోటు చేసుకుంటుంది. టీడీపీ, బీజేపి, జనసేన పార్టీలు బలపరిచిన బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా దారావత్ నాగమణి, కాంగ్రెస్ అభ్యర్థిగా దారావత్ సాత్విక పోటీలో ఉన్నారు. సాత్విక నాగమణికి బావ గారి బిడ్డ కావడం విషేషం ఒకే కుటుంబంలో పోటీలో నిలిచోవడంతో ఆసక్తికరంగా మారింది. వారి భవితత్వం ఈనెల 14న తేలన్నుంది.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆటో


యువకుడికి తీవ్ర గాయాలు

జూలూరుపాడు, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొనడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం మండలంలోని కొమ్ముగూడెం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే పడమట నర్సాపురం గ్రామానికి చెందిన పుల్లారి యశ్వంత్ ద్విచక్ర వాహనంపై కొత్తగూడెం నుంచి జూలూరుపాడు వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో జూలూరుపాడు నుంచి కొత్తగూడెం వైపు వెళుతున్న ఆటో కొమ్ముగూడెం గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యశ్వంత్ కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స అందించేందుకు కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. యువకుడి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనలు మేరకు మెరుగైన చికిత్స మేరకు ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి

బూర్గంపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి సమయంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండల పరిధిలోని అంజనాపురం గ్రామానికి చెందిన బాణోత్ సేవ్యా(65), అతని బంధువు భూక్యా పింపా(55)లు శనివారం గ్రామంలో రోడ్డు దాటుతున్న క్రమంలో సారపాక వైపునకు వెళున్న వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సేవ్యా అనే వృద్ధుడు చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందగా.. పింపా అనే వృద్ధురాలు కూడా చికిత్స పొందుతూ అర్ధరాత్రి సమయంలో మృతి చెందింది. ఆదివారం మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు పాల్వంచ సీఐ సతీష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.


సాగర్ కాలువలో వ్యక్తి గల్లంతు



సాగర్ కాలువలో గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం సిబ్బంది

ఖమ్మం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువలో ఓ వ్యక్తి గల్లంతైన సంఘట న ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లి వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన రసూల్(50) అనే లారీడ్రైవర్ ఒరిస్సా నుంచి పూనేకు లారీలో ఐరన్ లోడ్‌తో వెలుతున్నాడు. మార్గం మధ్యలో ఏదులాపురం మునిసి పాలిటీ పరిధిలోని మద్దులపల్లి సాగర్‌కాలువ వద్ద లారీని ఆపాడు. ఈ క్రమంలో కాలువలో స్నానం చేసేందుకు వెళ్లిన రసూల్ ప్రమాదవశాత్తు కాలువలో పడి గల్లంతైయ్యాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచా రం అందించగా ఇన్‌స్పెక్టర్ రాజు సంఘటనా స్థలానికి చేరుకుని ఎన్డీఆర్ ఎఫ్ బృందం సిబ్బంది ద్వారా సాగర్ కాలువలో రాత్రి వరకు గాలించిన ప్పటికీ రసూల్ ఆచూకీ లభ్యంకాలేదు. రసూల్ బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల తనిఖీ



మల్లు నందిని వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎన్నికల సిబ్బంది

మధిర రూరల్ / ముదిగొండ, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో ముదిగొండ మండలంలో ఆదివారం ఫ్లయింగ్ స్క్వాడ్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీటీ కరుణాకర్ మాట్లాడుతూ అక్రమంగా మద్యం, డబ్బును వాహనాల్లో తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మల్లు నందిని వాహనం తనిఖీ

పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మధిర మండలం మల్లారం గ్రామం వెళ్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని వాహనాన్ని ఎన్నికల సిబ్బంది తనిఖీ చేశారు.

సామాజిక మాధ్యమాలే... ప్రచార అస్త్రాలు

ఎన్నికల వాతావరణంలో తెల్లారిందా... పదండి జెండాలు పట్టండి అంటూ కేటాయించిన వార్డుల్లో, గ్రామాల్లో మైక్ కాన్వసింగ్, నాయకుల ప్రచారంతో హడావిడి నెలకొంటుంది. అలాగే పార్టీ కార్యాలయాల్లో ఎన్న డూలేని విధంగా ఓటర్లను ఎలా ప్రసన్నం చేసుకోవాలన్న ఆలోచనలతో వ్యూహాలు ప్రతివ్యూహాలు వేసుకుంటూ నాయకులు, కార్యకర్తలతో సందడి కనిపిస్తుంది. వార్డులు, గ్రామాల్లో తిరుగుతూ తమ సర్పంచ్, వార్డు అభ్యర్థుల కోసం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా చిత్ర, విచిత్ర పద్దతుల్లో నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేపడుతుంటారు. ప్రస్తుతం ఆ పద్దతులు కొత్త పుంతలు నింపుకున్నాయి. తక్కువ సమయంలో ఓటర్లను ఆకట్టుకునేలా సోషల్ మీడియా వేదికగా అభ్యర్థులు, నాయకులు ప్రచారం నిర్వహిస్తూ ప్రచారం హోరెత్తిస్తున్నారు.

- పైసా ఖర్చు లేకుండా అభ్యర్థుల ప్రచార హోరు
- ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ గ్రూపుల్లో సందేశాలు
- ప్రచార ఫొటోలు... వీడియోలు..
- కొన్నిచోట్ల ఇంటింటికీ తిరుగుతూ నాయకుల పర్యటన



అశ్వారావుపేట రూరల్/ మణుగూరు, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పంచాయతీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతుంది. అభ్యర్థు లు విజయమే లక్ష్యంగా పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థుల చేస్తున్న ప్రచారం కూ డా రానురాను కొత్త పుంతలు తొక్కుతుంది. ఒకపుడు ఇంటింటికి వెళ్లి ఓటు అడిగితేనే ప్రచారంగా ఉండేది. అపుడే అభ్యర్థి గుర్తు ఏమిటో తెలిసేది. కాని ప్రస్తుతం గతంలో ఎన్నడూ లేని విధంగా వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం వంటి సామాజిక మాధ్యమాలను అభ్యర్థులు ప్రచార వేదికలుగా వినియోగించుకుంటున్నారు. వాట్సా ప్ గ్రూపుల్లో పోటాపోటీగా ప్రచారానికి సంబంధించిన ఫోటోలు షేర్ చేసుకుంటున్నారు. ప్రస్తుతం సెల్‌ఫోన్ ప్రతిఒక్కరి చేతుల్లో ఉం టుంది. అందులో కనీసం పది వాట్సాప్ గ్రూపులన్నా ఉంటున్నాయి. దీంతో అభ్యర్థులు ఓ అడుగు ముందుకేసి సామాజిక మాధ్యమాల ద్వారా ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఇం దుకు ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి పైసా ఖర్చులేకుండా తమ ప్రచారం కొనసాగిస్తున్నారు. అధికార పార్టీ అభ్యర్థులు ప్రభు త్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తుండగా.. ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులు ప్రభుత్వ వైఫల్యాలివే అంటూ.. ప్రచారం చేస్తున్నారు. కొంద రు తాము చేపట్టే పనులు, హామీలను కరపత్రాల రూపంలో ముద్రించి ప్రచారం చేస్తున్నా రు. అలాగే నిరక్షరాస్యులకు సైతం అర్థమయ్యే రీతిలో వాయిస్ మెసేజ్‌లు పంపుతూ ప్రచారం హోరెత్తిస్తున్నారు.

ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్‌లు...

సర్పంచి ఎన్నికల వేళ అభ్యర్థుల పేరుతో ప్ర త్యేకంగా మరికొన్ని గ్రూపులను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆయా గ్రూపుల్లో తమ ప్రచారా లు, గ్రామాభివృద్ధిపై ఓటర్ల అభిప్రాయాలు, నేతల సందేశాలు, హామీలు, రోజువారి కార్యక్రమాలను పోస్టు చేస్తున్నారు. ప్రత్యర్థులు పెట్టే పోస్టులకు సమాధానంగా మరికొన్ని పోస్టులు పెడుతున్నారు. అభ్యర్థులతో పాటు వారి మద్దతుదారులు, కుటుంబ సభ్యులు వీటినే ప్రచార అస్త్రంగా ఉపయోగించుకుంటున్నారు. కొన్ని గ్రా మాల్లో మహిళల పేరుతో వాట్సాప్ గ్రూపలను ఏర్పాటుచేసి గుర్తులను పెడుతూ గుర్తుంచుకోండి అంటూ ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థుల ఫోటోలు, గుర్తులతో ప్రత్యేక ఆకృతులను రూపొందించి ఓటర్లను ఆకట్టుకునేలా ప్రయత్నిస్తున్నారు. తమకే ఓటు వేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. మొత్తంగా అభ్యర్థులు మామూలు ప్రచారం కంటే సోషల్ మీడియా ద్వారానే ప్రచారం ముమ్మరంగా చేసుకుంటున్నారు.

కొన్నిచోట్ల నాయకుల ఇంటింటి ప్రచారం

మణుగూరు మేజర్ పంచాయతీతో పాటు కూనవరం ఇతర పంచాయతీల్లో కూడా నాయకులు, కార్యకర్తల హడావిడి కన్పించింది. అమ్మ.. అయ్యా.. అన్న.. చెల్లి.. అక్కా... అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ మీ అమూల్యమైన ఓటు మాకే వేయాలని, సర్పంచ్‌గా గెలిపించాలి అంటూ అభ్యర్థులతో పాటు నాయకులు, కార్యకర్తలు ఓటర్లకు విజ్ఞప్తులు చేస్తూ.. ప్రాధేయపడుతున్నారు. మరో నాలుగు రోజుల్లో ఎన్నికల ప్రచారం ముగియనుండటంతో తమ తమ వార్డుల్లోని ఓటర్లు ఎక్కడెక్కడ ఉన్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న వారిని ఎలా ఎన్నికల్లో పాల్గొనేలా చేయాలని... ఉన్న ఓటర్లను ఎలా ప్రసన్నం చేసుకోవాలన్న ఆలోచనలతో వ్యూహ్యాలు ప్రతివ్యూహాలు వేసుకుంటూ ప్రచారాలను సాగిస్తున్నారు. మండలంలోనే కాకుండా నియోజకవర్గంలో అతి పెద్ద మేజర్ పంచాయతీ అయిన సమితి సింగారంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల విజయం కోసం స్థానిక నాయకులతో పాటు కార్యకర్తలు అవిశ్రాంతగా శ్రమిస్తున్నారు.

కలగానే మిగులుతున్న సెంట్రల్ డివైడర్

నిత్యం ప్రమాదాలే..
అయినా అమలుకాని హామీలు
సత్తుపల్లి నుంచి కిష్టారం, గంగారంలకు డివైడర్ ఎప్పుడు



సత్తుపల్లి జీఎం కార్యాలయం ఏరియా



ఎన్టీఆర్ నగర్ నుంచి సత్తుపల్లికి వెళ్లే రహదారి

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏ ఎన్నికలు వచ్చినా రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలకు కొదువే ఉండదు. ప్రజలకు గొంతెమ్మ కోర్కెలు తీరుస్తామంటూ నాయకులు ఇంటింటికీ వెళ్లి మరీ ఓట్లు అడుగుతూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని చెబుతుంటారు. అలాంటిదే ఈ సమస్య. సత్తుపల్లి నుంచి కిష్టారం, గంగారంతో పాటు ఎన్టీఆర్ నగర్ వరకు సెంట్రల్ డివైడర్‌తో కూడిన రహదారిని నిర్మిస్తామంటూ గతంలో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చారు. ప్రమాదాలు జరిగినప్పుడల్లా అదిగో వచ్చేసింది.. ఇదిగో ఇచ్చేస్తామంటూ.. ప్రకటనలకే పరిమితమైన హామీలు అమలులో మాత్రం శూన్యమే అని చెప్పాలి. నిత్యం ప్రమాదాలు జరిగే ఈ రహదారుల్లో కనీసం హెచ్చరికలు కానీ.. భద్రతా నియమాలను సూచించే బోర్డులు కానీ కనిపించడం లేదు. వాటిని గతంలో ఉంచినప్పటికీ పలు ప్రమాదాల వలన ధ్వంసమవ్వడం, పాత ఇనప సామాను కొట్లకు చేరుకున్నట్లు వాహనదారులు ఆరోపిస్తున్నారు.

ఎన్టీఆర్ నగర్ వరకైనా...

కిష్టారం వైజంక్షన్ దాటిన తర్వాత టర్నింగ్ తిరిగే ముందు రోడ్డు వెడల్పు తగ్గిన విషయాన్ని గమనించని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్టీసీలో పనిచేసే ఓ ఇద్దరు వ్యక్తులకు గతనెలలో మొరాయించిన బస్‌ను బాగుచేసి వస్తుండగా.. ఇక్కడే ప్రమాదానికి గురవడంతో ఒకరికి కాలు విరగ్గా మరొకరు గాయాలపాలయ్యారు. సత్తుపల్లి పట్టణంలోని రింగ్ సెంటర్ నుంచి ఎన్టీఆర్ నగర్ వరకు అయితే రోజులో పదికి పైగా ప్రమాదాలు చోటుచేసుకుంది. గతనెలలో ఆర్టీవో ఆఫీస్ ఎదుట రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని బైక్ ఢీకొనగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ప్రమాదాల్లో మరికొంత మంది కాళ్లూచేతులు విరిగి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. షాదీఖానా వద్ద వడ్లబస్తాలతో వెళ్తున్న లారీ నుంచి బస్తాలు కిందపడగా ఇది గమనించని ఓ వ్యక్తి ఆటోతో సహా బోల్తా కొట్టగా ఆసుపత్రి పాలయ్యాడు. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ రహదారి వెంట ఎన్నో ప్రమాదాలు...

జాతీయ రహదారిపై ప్రమాదాలు

తెలంగాణ- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలిపే తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారి 365 బీబీపై నిత్యం ప్రమాదాలే. మండలంలోని కిష్టారం మీదుగా సత్తుపల్లి పట్టణం, తాళ్లమడ, బేతుపల్లి, గంగారం, ప్రకాష్‌నగర్, రామగోవిందాపురం, మేడిశెట్టివారిపాలెం అడ్డరోడ్డులపై ఎప్పుడూ ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటుంది. సత్తుపల్లి నుంచి కిష్టారం, మేడిశెట్టివారిపాలెం క్రాస్‌రోడ్డు వరకు మొత్తం సుమారు 20 కిలోమీటర్లు ఉండగా ప్రమాదాల నివారణకు సెంట్రల్ డివైడర్‌తో కూడిన రహదారి ఇప్పుడు అత్యవసరం. కిష్టారం, గంగారంలో రెండున్నర కిలోమీటర్ల మేర ఇప్పటికే సెంట్రల్ డివైడర్ ఉండగా మిగతా ప్రాంతాల్లో నిర్మించాల్సి ఉంది. డివైడర్ ఉన్నట్లయితే ముఖ్యంగా రాత్రి సమయాల్లో ప్రమాదాలను నివారించే అవకాశం ఉండగా.. అతివేగం వలన ఎలా ఉన్నా ప్రమాదాలు జరుగుతుందనేందుకు ఈనెల 3న చోటుచేసుకున్న ప్రమాదమే ఉదాహరణ. ఇప్పటికే అటు అధికారులుగానీ.. ఇటు రాజకీయ నాయకులు గానీ త్వరగా స్పందించి ప్రమాదాలను నివారించేందుకు సెంట్రల్ డివైడర్‌ను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం కేసు నమోదు

కల్లూరు, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మండలంలోని ఎర్రబోయనపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై కల్లూరు పోలీసులు ఆదివారం హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానిక పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పాత ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన నల్లగట్ల అనిల్‌పై పాత గొడవల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన కొంగల నాగరాజు బీరు సీసాతో పొడిచి హత్యాయత్నానికి పాల్పడటం జరిగిందని బాధితుడి తండ్రి తిరపతయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో నిందితుడైన నాగరాజుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్ఐ డి.హరిత తెలిపారు.

గుండెపోటుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి



ఉపాధ్యాయుడు మధు (ఫైల్)

అశ్వారావుపేట రూర ల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతిచెందిన సంఘటన అశ్వారావుపేటలో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. మండలంలోని దురదపాడు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కట్టా మధు(45) పట్టణంలో జరుగుతున్న యూటీఎఫ్ జిల్లా విస్తృతక మిటీ సమావేశంలో పాల్గొన్నాడు. సమావేశంలో ఉండగానే గుండెపోటుకు గురైన మధు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే తోటి ఉపాధ్యాయులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. యూటీఎఫ్‌లో ఎంతో క్రియాశీలకంగా వ్యవహరించే మధు అకాల మరణంతో ఉపాధ్యాయులు దిగ్భ్రాంతికి గురయ్యారు. మధు మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతదేహానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి, జిల్లా నాయకులు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మధు మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు. మృతిచెందిన ఉపాధ్యాయుడు మధుకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఆయన భార్య కూడా ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుంది.

గూడ్స్ రైలు ఢీకొని యువకుడికి గాయాలు

మద్యం మత్తులో రైల్వేట్రాక్ దాటుతుండగా ప్రమాదం... విరిగిన కాలు
క్షతగాత్రుడిని వరంగల్ ఎంజీఎంకు తరలింపు



గూడ్స్ రైలు ఢీకొన్న యువకుడిని ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది, రైల్వే పోలీసులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవ శాత్తు రైలు ఢీకొన్న సంఘటనలో కాలు పూర్తిగా విరిగిపోయిన సంఘటన కొత్తగూడెం రైల్వే స్టేషన్ (భద్రాచలం రోడ్) పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రైటర్ బస్తీ గొల్లగూడెం పక్క నున్న రైల్వే ట్రాక్ నందు యూసఫ్ అనే యువకుడు మద్యం సేవించి రైల్వే ట్రాక్ దాటుతుండగా అటుగా వస్తున్న గూడ్స్ రైలు ఢీ కొంది. దీంతో కింద పడి కుడికాలు విరిగిపోయింది. అటుగా వెళ్తున్న పాదాచారులు రైల్వే జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులకు, 108 అంబులెన్స్ సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది ఈఎంటి స్రవంతి, పైలట్ తరుణ్‌ప్రసాద్ క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో ఎక్కించుకొని ప్రథమ చికిత్స నిర్వహిస్తూ కొత్తగూడెం సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన సిబ్బంది యూసఫ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

ఖమ్మం క్రైమ్ డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొని తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై ఖమ్మం పోలీస్‌స్టేషన్ నందు ఆదివారం రాత్రి కేసు నమోదైంది. ఈ ఘటనకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం నగరంలోని నిజాంపేట గొల్లబజారుకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి గుంటి వెంకటనారాయణ (68) శనివారం రాత్రి వైరా రోడ్డులో రోడ్డు దాటుతుండగా ఓ ఆటో అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో స్థానికులు క్షతగాత్రుడిని ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేట్ అసుపత్రికి తరలించగా అక్కడ చికత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ట్రాలీఆటో బోల్తా..

ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు



విష్ణువర్ధన్‌రాజు మృతదేహం



ప్రమాదంలో గాయపడిన కూసం రమాదేవి

నేలకొండపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ట్రాలీఆటో బోల్తాపడి ఓ వ్యక్తి మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం మండల పరిధిలోని చెన్నారం గ్రామంలో జరిగింది. వివరాల ప్రకారం ఆంధ్రాలోని ఎన్‌టీఆర్ జిల్లా ముదునూరుకు చెందిన కూసం విష్ణువర్ధన్‌రాజు మండల పరిధిలోని చెన్నారం గ్రామంలోని మిల్లును రెండున్నర ఏళ్ల క్రితం లీజుకు తీసుకుని నడుపుకుంటున్నాడు. ప్రతి ఆదివారం కూసుమంచి మండలం జక్కేపల్లిలోని చర్చికి వెళ్లి ప్రార్థన చేసుకుని తిరిగి చెన్నారం వెళతాడు. అదే క్రమంలో ఆదివారం భార్య రమాదేవి, కుమారుడు ఎలీషా, గ్రామానికి చెందిన రాయబారపు పద్మ అనే మహిళతో కలిసి ట్రాలీఆటోలో చెన్నారం నుంచి జక్కేపల్లిలోని చర్చికి వెళ్లాడు. ప్రార్థనల అనంతరం తిరిగి చెన్నారం చేరే క్రమంలో, గ్రామం మలుపు వద్ద ఆటోబోల్తా పడింది. దీంతో కూసం విష్ణువర్ధన్‌రాజు (55) అక్కడికక్కడే మృతి చెందగా, కూసం రమాదేవి, రాయబారపు పద్మలు తీవ్రంగా గాయపడ్డారు. కుమారుడు ఎలీషాకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో క్షతగాత్రులు ఇద్దరినీ నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. విష్ణువర్ధన్ రాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి సీహెచ్‌సీలో భద్రపరిచారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు ఎలీషా ఉన్నాడు.



ఎన్నికల ప్రచారంలో ఘర్షణ

(5వ పేజీ తరువాయి)

ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ కార్యకర్త ఒకరు.. బీఆర్ఎస్ ప్రచార వాహన డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, బీఆర్ఎస్ నాయకులు వెంటనే పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌కు చేరుకొని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాస్తారోకో చేశారు. తమ ప్రచార వాహనం నడిపే డ్రైవర్‌పై కాంగ్రెస్ కార్యకర్త దాడికి పాల్పడడం సరికాదన్నారు. ఈ విషయమై వారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ.. తమ ప్రచార వాహన డ్రైవర్‌పై కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడడం సిగ్గు చేటన్నారు. తమపై దాడికి పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి: ఎస్ఐ

పినపాక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఏడూళ్లబయ్యారం ఎస్ఐ పి సురేష్ కోరారు. జానంపేటలో ఆదివారం జరిగిన ఎన్నికల అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉందని, ప్రతి ఒక్కరు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలి తప్ప అనవసరమైన వివాదాలకు పాల్పడితే బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షాధారులకు ఇరుముడులు

మణుగూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దీక్ష దారులు కొందరు ఆదివారం మణుగూరు సివిల్ ఆఫీసు ముందున్న కనకదుర్గా దేవి ఆయలంలో ఇరుముడులను కట్టుకుని శబరి యాత్రకు బయలు దేరారు. సుమారు 150 మంది అయ్యప్ప దీక్ష దారులకు వారి గురు స్వాములు భక్తి శ్రద్ధలతో ఇరుముడులను కట్టి శిరస్సున దరింప జేశారు. కుటుంబ సభ్యులు అయ్యప్పల తో అలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది. శరణం అయ్యప్ప అనే శరణుఘోషతో పరిసర ప్రాంతం మార్మోగింది. ఇరుముడుల ను తలపై దరించుకున్న అయ్యప్పలు పలు వాహనాల ద్వారా శబరిమలైకు పయనం అయ్యారు.

ప్రతీ రోజు పైడిగూడేనికి ఆర్టీసీ సర్వీసు

దుమ్ముగూడెం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం-పైడిగూడెం ఆర్టీసీ సర్వీసును ఇకపై ఏడాది పొడవునా తిప్పేందుకు ఆర్టీసీ అధికారులు పచ్చజెండా ఊపారు.ప్రస్తుతం కేవలం విద్యాలయాలు నడిచే రోజుల్లో తప్ప సెలవు దినాల్లో సర్వీసును తిప్పడం లేదు. కె.లక్ష్మీపురం గ్రామస్థులు కనుబుద్ధి దేవా తదితరులు ఇటీవల డీఎంను కలిసి అభ్యర్ధించారు. భద్రాచలం నుంచి ఉదయం 6.15కు సాయంత్రం 5 గంటలకు రెండు పూటలా సర్వీసును తిప్పుతారు. కె.లక్ష్మీపురం గ్రామస్థులు ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆ పంచాయతీల ఎన్నికలను రద్దు చేయాలి: సీపీఎం

పాల్వంచ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలంలో వేలంపాట ద్వారా ఎన్నికైన గ్రామపంచాయతీ ఎన్నికలను రద్దు చేయాలని సీపీఎం జిల్లా నాయకులు అన్నవరపు సత్యనారాయణ అధికారులను కోరారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏకగ్రీవం పేరుతో వేలం పాటలు నిర్వహించి డబ్బులు తీసుకునే సంస్కృతిని పలు రాజకీయ పార్టీలు అలవాటు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజా సమస్యలు, గ్రామ అభివృద్ధి కోసం పాటుపడే వారు ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలన్నారు. వేలం పాటలు నిర్వహించడం అప్రజాస్వామ్యమని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు కొండబోయిన వెంకటేశ్వర్లు, పాతాల వెంకట్రావు, పెద్దబాబు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రవికుమార్

భద్రాచలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం అభివృద్ధిపై బీజేపీ బహిరంగ చర్చకు సిద్ధమా అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. భద్రాచలంలో ఆదివారం జరిగిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భద్రాద్రిని ముక్కలు చేసిన పాపం బీజేపీదేనని, ఐదు పంచాయతీలను ఎప్పుడు అప్పగిస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. చట్టాల పేరుతో అరచాకాలను సృష్టించే వారిని భద్రాద్రి ప్రజలు ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్, గడ్డం స్వామి, బండారు శరత్‌బాబు, డి.సీతాలక్ష్మి పాల్గొన్నారు.

ఓడిపోతామనే భయంతోనే..

కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రామనాథం

పినపాక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పదేళ్లలో అడ్డగోలుగా దోచుకున్న బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధి చెందారే తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గొడిశాల రామనాథం అన్నారు. ఆదివారం ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలకు ఘాటుగా స్పందించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో ముందస్తుగానే బీఆర్ఎస్ నాయకులు స్ట్రాటజీతో మాట్లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వి లక్ష్మీరెడ్డి, గంగిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, గొంది రాధ, చీకటి సత్యనారాయణ, తాల్లూరి కాంతారావు, ఎట్టి సర్వేశ్వర రావు, వీరాస్వామి, కె సంపత్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి సీపీఎం లక్ష్యం

ఇల్లెందుటౌన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను బలపర్చాలని ఇల్లెందు మండల కార్యదర్శి ఆలేటి కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో సర్పంచ్, వార్డులకు పోటిచేసిన అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేసే సంక్షేమ పథకాలను అమలు చేయాలంటే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో మండల నాయకులు తాళ్లూరి కృష్ణ, మన్నెంమోహన్‌రావు, బయ్యాఅభిమన్యు, ఎండీ అబ్బాస్, వజ్జాసురేశ్, జైబున్నీసా, సుజాత, విజయ్‌మోహన్‌సింగ్, రాజు, రాములు, కృష్ణకుమారి, వసంత, కనకమహలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు స్వచ్ఛంద సంస్థల సేవలు శ్లాఘనీయం

● భద్రాద్రి దేవస్థానం ఈవో దామోదర్‌రావు



కళ్లజోళ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

భద్రాచలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అంధత్వ నివారణకు, గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్న రెడ్ క్రాస్, మారుతి నర్సింగ్ కళాశాల, లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో కె.దామోదరరావు, డీసీహెచ్ఎస్ బి.రవిబాబులు పేర్కొన్నారు. భద్రాచలంలో రెడ్ క్రాస్ , మారుతి నర్సింగ్ కళాశాల, లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో జరిగిన కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పేద ప్రజలు, వృద్ధులు కంటి చూపును పొందడం ఆనందంగా ఉందన్నారు. 190 గ్రామాలకు చెందిన 1625 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాఎస్ఎల్ కాంతారావు, జి.రాజారెడ్డి, కమలా రాజశేఖర్, నక్కా వెంకన్న యాదవ్, తిప్పన సిద్దులు, చారుగుళ్ళ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయ పరిశీలకురాలి పర్యటన

దుమ్ముగూడెం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో ఎన్నికల వ్యయ పరిశీలకురాలు లావణ్య, నోడల్ అధికారి ఏ.వీ.రెడ్డి ఆదివారం పర్యటించారు. ఎంపీడీఓ కార్యాలయాల్లో అభ్యర్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నామినేషన్ పత్రాలు, ఎన్నికల వ్యయ నమోదు రిజిష్టర్లు, షాడో రిజిష్టర్లు, రసీదులు, లావాదేవీల వివరాలను సమగ్రంగా పరిశీలించారు. వ్యయ పరిమితుల అమలు, పత్రాల నిర్వహణలో ఖచ్చితత్వం, పారదర్శక విధానాలను సంబంధిత సిబ్బందికి సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత అత్యంత ముఖ్యమని, ఏవైనా లోపాలుంటే తక్షణమే సరిదిద్దాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీఓ వివేక్‌రాం, సీఐ వెంకటప్పయ్య, ఏపీఎం జగదీష్ తదితరులున్నారు.

శిథిలావస్థలో వందేళ్ల అతిథిగృహం

» ఏళ్లు గడిచినా మరమ్మతులు కరువు



బ్రిటిష్ కాలంనాటి ఆర్అండ్‌డీ అతిథిగృహం

ఇల్లెందుటౌన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): బ్రిటిష్‌కాలంలో నిర్మితమైన అతిథిగృహం.. ప్రస్తుతం శిథిలావస్థలో కొట్టుమిట్టాడుతుంది. ఎన్నో ఏళ్లుగా ఉన్న అతిథి గృహంకు కనీసం మరమ్మత్తులు కూడా కరువయ్యాయి. అధికారులు మరమ్మత్తుల సైతం చేసే పరిస్థితి లేకపోవడంతో అతిథిగృహం ఆలానాపాలన లేక బూతు బంగ్లలేక్క తయ్యారయ్యింది. ఇల్లెందు పట్టణంలోని గోవింద్‌సెంటర్ సమీపంలో 1916లో బ్రిటిష్ అధికారులు అతిధిగృహన్ని నిర్మాణం చేశారు. రాతికట్టడంతో నిర్మాణం సాగింది. చుట్టు ప్రహరితో పాటు లోపల అతిధిగృహంకు అనుసందానంగా మరోక భవనం నిర్మాణం చేశారు. సుమారు 109 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఈభవనం బ్రిటిష్‌కాలం చరిత్రకు, అనవాళ్లకు సాక్షిగా మిగిలింది. బ్రిటిష్‌కాలం తరువాత నిత్యం వాడుకలోనే ఉన్నప్పటికీ గత కొంతకాలంగా ఎవరు పట్టించుకోవడం లేదు. నూతన భవనం నిర్మాణం లేదా ఈ భవనంకే మరమ్మతులు చేసేయిన బ్రిటిష్‌కాలం నాటి భవనంను కాపాడే ప్రయత్నం కూడా చేయడం లేదని పలువురు వాపోతున్నారు. నిత్యం ఎంతో మంది అధికారులు అధికారికంగా వినియోగించుకునే అవకాశం ఉన్నప్పటికీ పట్టింపు లేకపోవడంతో మందుబాబులకు నిలయంగా మారింది. చుట్టు ప్రహరి కూలి పోవడంతో పశువులు రాకపోకలు సాగిస్తున్నాయి. భవనం ఆవరణం అంతా బిచ్చగాళ్లకు నిలయంగా మారింది. కొద్దిపాటి మరమ్మత్తులు చేసిన వినియోగంలోకి వస్తుంది. లోపలిభాగంలో పై పెచ్చులు ఊడిపడిపోతున్నాయి. ఆర్అండ్‌బీ అధినంలోనే ఉన్నప్పటికీ అశాఖనుంచి అయిన నిధులు కేటాయించి మరమ్మత్తులు చేయాల్సిన అవసరం ఉంది పట్టణ ప్రజానీకం వాపోతున్నారు.

మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపాం

ఎస్పీ ప్రసాద్ ఆర్అండ్‌బీ డీఈ, ఇల్లెందు సబ్‌డివిజన్

బ్రిటిష్‌హయంలో నిర్మాణం చేసిన అతిధిగృహంకు మరమ్మత్తుల కోసం గతంలోనే ప్రతిపాదనలు పంపాం. పూర్తిస్థాయిలో నిధులు మంజూరైతే వెంటనే మరమ్మత్తులు చేయిస్తాం. అంతేకాకుండా నూతన అతిధిగృహం కోసం కూడా అంచనాలు రూపొందించాం. ప్రభుత్వ ఉన్నతాధికారుల స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్నాయి. గెస్టుహౌస్‌ను కాపాడే ప్రయత్నాలే చేస్తున్నాం.

పని ఒత్తిడిని తగ్గించాలి

డిపోను కాపాడాలి

మహిళా కండక్టర్ల నిరాహార దీక్ష



దీక్షలో పాల్గొన్న మహిళా కండక్టర్లు

మణుగూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మణుగూరు డిపోలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి.. కార్మికులపై పెరిగిన పనిభారాన్ని తగ్గించాలని మణుగూరు డిపోలో పనిచేసే మహిళా కండక్టర్లు ఆదివారం రిలే నిరహర దీక్ష శిబిరంలో పాల్గొని డిమాండ్ చేశారు. యాజమాన్యం సత్వరమే స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిపోను కాపాడాలని డిమాండ్ చేశారు. 16 రోజులుగా కార్మికులు తమ న్యాయమైన సమస్యలను, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్నా యజమాన్యం స్పందించకపోవడం దారుణమైన విషయమన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలను పరిష్కరించి డిపో అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి: ఎమ్మెల్యే పాయం



ఏకగ్రీవ సర్పంచ్‌లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు రూరల్/పినపాక/కరకగూడెం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని రకాల ప్రభుత్వ పథకాలను ప్రవేశపెట్టి అభివృద్ధి పరుస్తున్నారని స్థానిక సంస్థల ఎన్నికలలో అభివృద్ధి పరిచే అభ్యర్థులకు ఓటు వేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మణుగూరు మండలం దమ్మక్కపేట, సాంబాయిగూడెం, రామనుజవరం, తిర్లపూరం గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేస్తున్న సర్పంచ్, వార్డు సభ్యుల విజయాన్ని కాంక్షిస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు తదితర సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. అభివృద్ధికి పట్టం కట్టాలని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కురసం రాంబాబు, కామిశెట్టి రామారావు, శోభన్‌బాబు, జయగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ సర్పంచ్‌లకు సన్మానం

పినపాక: మండలంలోని 3 గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఈ సందర్భంగా ఏకగ్రీవమైన పంచాయతీలైన కిష్టాపురం గ్రామ నూతన సర్పంచ్ కారం పాపారావు, పాతరెడ్డిపాలెం గ్రామపంచాయతీ నూతన సర్పంచ్ సాగబోయిన నాగకుమారిలను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం మణుగూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. పినపాక మండలంలోని ఏకగ్రీవమైన 3 గ్రామపంచాయతీల సర్పంచులు యువతే కావడంతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆ రెండు పంచాయతీలు ఏకగ్రీవమయ్యేందుకు, తన రాజకీయ అనుభవం, చతురతతో కృషి చేసిన మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏలూరి నారాయణరెడ్డి, కంది విజయ్, గగ్గూరి ఖాదర్‌బాబు, సుతారి నాగేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కరకగూడెం: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి పార్టీలోకి పెద్దఎత్తున చేరుతున్నారని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండలంలోని చిరుమళ్ళ పంచాయతీ మాజీ ఎంపీటీసీ బీఆర్ఎస్ నాయకుడు వట్టం సురేందర్‌తో పాటు భట్టుపల్లి పంచాయతీ నుంచి సుమారు 30 కుటుంబాలు మణుగూరు ప్రజా భవన్‌లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పాయం వారికి పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు చందా సంతోష్ కుమార్, మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, తోలెం నాగేశ్వరరావు, సర్పంచ్ అభ్యర్థి వట్టం సమ్మక్క, ఏడూళ్ళ రఘునాధరావు, లింగయ్య, సూర్యకాంతం, వట్టం తిరుపతయ్య, కావ్య తదితరులు పాల్గొన్నారు.

పల్లెప్రకృతి వనమా.. డంపింగ్ యార్డా?



నరసాపురం-కె.మారేడుబాక ప్రకృతివనం

దుమ్ముగూడెం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నరసాపురం-కె.మారేడుబాకగ్రామపంచాయతీలు ఉమ్మడిగా నిర్మించిన పల్లెప్రకృతి వనం డంపింగ్ యార్డులా మారింది. సుమారు రెండు నెలలుగా పంచాయతీ సిబ్బంది ట్రాక్టరుపై సేకరించిన చెత్తను పల్లెప్రకృతివనం ముందు భాగంలో పోసి తగలబెడుతున్నారు. పొగ, ఘాటు వాసనలు రావడంతో ప్రక్కనే ఉన్న ప్రధాన రహదారిపై ప్రయాణించే వారు ఇబ్బంది పడుతున్నారు. అలాగే ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగితే పల్లెప్రకృతి వనం కూడా తగలబడిపోయే ప్రమాదం ఉంది. అలాగే పల్లెప్రకృతి వనం మందుబాబులకు అడ్డాగా మారింది. చెట్ల మధ్య ఖాళీ సారా పాకెట్లు, మద్యం బాటిళ్ల దర్శనమిస్తున్నాయి. నరసాపురం పంచాయతీ కోసం వెంకట్రామపురంలో డంపింగ్‌యార్డు నిర్మించగా, అక్కడ వేయాల్సిన చెత్తను పల్లెప్రకృతివనం పరిసరాల్లో పోయడం పట్ల స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పైగా ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరించకుండా, ఒకట్రెండు ప్రాంతాల నుంచి మాత్రమే తరలించడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జోరుగా పల్లె పోరు

(5వ పేజీ తరువాయి)

బరిలో నిలిచారు. మొత్తం 155 గ్రామపంచాయతీలకు 277 సర్పంచ్ అభ్యర్థులు, వార్డులకు 534 మంది నామినేషన్లు ఉపసంహరించుకోగా.. 138మంది సర్పంచ్, 1123 మంది వార్డు సభ్యులు బరిలో ఉన్నారు. తొలివిడత ఎన్నికల్లో మొత్తం 16 గ్రామపంచాయతీల్లో సర్పంచ్, 386మంది వార్డు సభ్యులను ఏకగ్రీవమైనట్లు అధికారికంగా అభ్యర్థులకు ధృవపత్రాలను అందించారు. ఉపసంహరణ గడువు మూయడంతో తుది జాబితా పేర్లను అధికారికంగా ప్రకటించడంతో జిల్లాలో రెండవ విడత పంచాయతీ ఎన్నికల పోరు సంగ్రామం రసవత్తరంగా మారింది. వివిధ పార్టీలకు చెందిన, బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యులు, స్వతంత్ర అభ్యర్థులు తమ వాగ్దానాలను ఓటర్లకు తెలియజేస్తున్నారు. అదేవిధంగా జిల్లాలో చుంచుపల్లి మండలంలో వంద మంది నాయకులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి సమక్షంలో మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో చేరారు. అదేవిధంగా లక్ష్మీదేవిపల్లి మండలంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్షంలో సీపీఐ కండువా కప్పుకుని పార్టీలో చేరారు.

● జిల్లాలో వ్యయ పరిశీలకురాలు లావణ్య పర్యటన

జిల్లాలో జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకురాలు లావణ్య దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో పర్యటించారు. నామినేషన్ పత్రాలు, ఎన్నికల వ్యయ రిజిష్టర్లు, షాడో రిజిస్టర్, రశీదులను, లావాదేవీల వివరాలను సమగ్రంగా పరిశీలించారు. వీరి వెంట ఎక్స్పెండెచర్ నోడల్ ఆఫీసర్ ఎంవి. రెడ్డి, స్థానిక ఎంపీడీవో, సిబ్బంది ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులు

భద్రాచలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఆదివారం రంగనాయకుల గుట్ట ప్రాథమిక పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1975 నుంచి 1982 వరకు ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులంతా నాలుగు దశాబ్దాల తరువాత కలిసి తమ జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనడంతో పాటు సెల్ఫీలు, గ్రూప్‌ఫోటోలు దిగారు. కార్యక్రమంలో కొడాలి శ్రీనివాసన్, కుంచాల రమేష్, పసుపులేటి సత్తిపండు, గు బ్బల వెంకటేశ్వర్లు, అనిత, రమాదేవి పాల్గొన్నారు..

బీఆర్ఎస్‌లో చేరిక


దమ్మపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అకినేపల్లి పంచాయతీ పరిదిలోని జలవాగు గ్రామానికి చెందిన పలు కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని మెచ్చా అన్నారు. అబివృద్ధి కావాలంటే పంచాయతీలలో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేసారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దొడ్డా రమేష్, ఆళ్ళ జంగం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మర్కోడు అంగన్‌వాడీ-2లో తాగునీటి కటకట

● నెల రోజులుగా పనిచేయని చేతిపంపు

ఆళ్లపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆళ్లపల్లి మండలం, మర్కోడు అంగన్‌వాడీ-2 కేంద్రంలో చేతిపంపు పనిచేయక సంబంధిత నిర్వహకులు, పిల్లలు తాగునీటికి, ఇతర సౌకర్యాలకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. మర్కోడు గ్రామంలోని అటవీశాఖ కార్యాలయం పక్కన ఉన్న అంగన్‌వాడీ-2 కేంద్రంలోని చేతిబోరు మరమ్మతులకు గురై నెల రోజులు కావస్తున్నా పట్టించుకునే నాధుడు కరువయ్యారు. చేతిపంపు మరమ్మతులకు గురికావడంతో అంగన్‌వాడీలో వంటకు, ఇతర అవసరాలకు ఉపయోగపడే నీరు అందుబాటులో లేకపోవడంతో నిర్వహకులు అనే ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం చేతిపంపు మరమ్మతులు చేయలని కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే జారే



పట్వారిగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలంలోని జగ్గారం, పట్వారీగూడెం, బాలరాజుగూడెం, అంకంపాలెం, ఆర్లపెంట, పార్కలగండి, గుర్వాయిగూడెం గ్రామాలలో ఆదివారం సాయంత్రం పర్యటించి పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థించారు. ఆయనమాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతో సాధ్యమని ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికి సంక్షేమపథకాన్ని అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వందే అన్నారు. ఈకార్యక్రమంలో స్థానికి కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

» సై అంటున్న అభ్యర్థులు
» హామీల వర్షం
» 14న రెండో విడత ఎన్నికలు



పంచాయతీ కార్యాలయం వద్ద పోటీలో నిలిచిన అభ్యర్థులు

చుంచు పల్లి/పాల్వంచ రూరల్/అశ్వారావు పేట, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): చుంచుపల్లి మండలంలో రెండో విడత నామినేషన్ల ప్రక్రియలో ఉపసంహరణ గడువు ముగియడంతో బరిలో నిలుచున్న అభ్యర్థుల్లో తీవ్ర పోటీ నెలకొంది. మండలంలోని 18 గ్రామ పంచాయతీలు ఉండగా 168 వార్డులు ఉన్నాయి. వాటిలో ఒక సర్పంచ్, తొమ్మిది మంది వార్డు సభ్యులు ఏకగ్రీవం అయ్యారు. బరిలో సర్పంచ్‌కు -51, వార్డుకు - 411 మంది బరిలో నిలిచారు. మండలంలో పురుషులు -18743 , మహిళలు-19814, ఇతరులు - 05, మొత్తం 38562 ఓటర్లు ఉన్నారు.

నేనంటే నేనే ...

చుంచుపల్లి మండలంలో పంచాయతీ ఎన్నికల పోటీ రసవత్తరంగా నేనంటే నేను అంటూ అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. శనివారంతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో బరిలో నిలిచిన అభ్యర్థులు కాంగ్రెస్, సీపీఐ, బీఆర్ఎస్, టీడీపీ, జేబీపీ, బీజేపీ, స్వతంత్ర అభ్యర్థులు పంచాయతీ ఓటర్లను ఆకట్టుకునే విధంగా వాగ్దానాలు చేస్తూ హామీల వర్షాలు కురిపిస్తున్నారు. కోతుల బెడద లేకుండా ప్రతి రోజు పంచాయతీలో పారిశుద్యం , డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా ఉండేలా కృషి చేస్తామని ప్రకటిస్తున్నారు. అదే విధంగా కొంతమంది నాయకులు బీఆర్ఎస్ పార్టీలు వీడి ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి సమక్షంలో సుమారు వంద మంది కాంగ్రెస్ పార్టీ తీర్థాన్ని పుచ్చుకున్నారు. ఏదేమైనా 14న ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించేందుకు ఎవరి ప్రయత్నాలు వారు జోరుగా చేస్తున్నారు.

పేట బరిలో 64 మంది అభ్యర్థులు

అశ్వారావుపేట: అశ్వారావుపేట మండలంలో 27 గ్రామ పంచాయతీలకు గాను మద్దికొవడ, రామన్నగూడెం పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. 25 గ్రామ పంచాయతీలలో ఎన్నికలు జరుగనున్నాయి. 25 గ్రామ పంచాయతీలలో ఉప సంహరణ అనంతరం 64 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. తుది జాబితా అభ్యర్థులకు ఎన్నికల అధికారులు ఎన్నికల గుర్తులను ఇచ్చారు. వీరందరికి ఎన్నికల గుర్తులు కూడ జారీ చేయడంతో అభ్యర్థుల ప్రచార జోరు ఊపందుకుంది. ప్రచార హోరుతో గ్రామాలు సందడిగా మారాయి.

పోసగని పొత్తులు ..

పాల్వంచ రూరల్: పాల్వంచ మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల రెండవ విడత ప్రక్రియలో భాగంగా నామినేషన్ల గట్టం పూర్తికాగా 36 గ్రామపంచాయతీలలో 4 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. ఒక గ్రామపంచాయతీకి ఎవరు నామినేషన్లు వేయకపోవడంతో వాయిదా పడింది. ఇప్పుడు 31 గ్రామపంచాయతీలలో 98 మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కాంగ్రెస్, సీపీఐలకు సంబంధించిన నాయకులే ఎక్కువ గ్రామపంచాయతీల్లో తమ పార్టీ అభ్యర్దులనునిలిపారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు కొన్ని గ్రామపంచాయతీల్లో మాత్రమే పోటీలో నిలిపారు.